గాయత్రీ.. పాహిమాం!



సుండుపల్లె : గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో అమ్మవారు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇంకా కొన్ని చోట్ల పార్వతీదేవి, భవానీదేవీ రూపాల్లో అమ్మవారు కరుణించారు. అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సిద్దవటం : గాయత్రీదేవి అవతారంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



గాలివీడు : గాయత్రీదేవి అలంకారంలో శ్రీ ఇరుగులమ్మ తల్లి



లక్కిరెడ్డిపల్లి: గాయత్రిదేవి అలంకారంలో సర్వమంగళాదేవి అమ్మవారు



సిద్దవటం : రాజరాజేశ్వరిదేవి అలంకరణలో శ్రీ గంగాభవానీ అమ్మవారు



చిన్నమండెం : భవానీదేవి అలంకారంలో శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు



రాయచోటి : పార్వతీ దేవి రూపంలో శ్రీ భద్రకాళీ అమ్మవారు



రాయచోటి : అన్నపూర్ణేశ్వరీ దేవి రూపంలో కన్యకాపరమేశ్వరీ దేవి



ఒంటిమిట్ట : రాజరాజేశ్వరి దేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరి దేవి



రాజంపేట టౌన్ : మధురమీనాక్షీదేవి అలంకారంలో మారెమ్మ



నందలూరు:పార్వతీదేవి అలంకారంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి



వీరబల్లి : పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

గాలివీడు : దేవీ నవరాత్రుల్లో రెండవ రోజు ఆశ్వయుజ శుక్ల తదియ నాడు కదంబవనవాసిని అయిన పరమేశ్వరి శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని గోపనపల్లె గ్రామం పూజారివాండ్లపల్లెలో వెలసిన ఇరుగులమ్మ తల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వేదపండితులు నాగఫణి కిషోర్ శర్మ మాట్లాడుతూ దైవ శక్తులకే మూలాధారం అయిన గాయత్రీ మాతను ధ్యానిస్తూ, ఆమె సర్వ మంగళ స్వరూపాన్ని దర్శించుకునే భక్తుల ఇంట సిరి సంపదలకు లోటు కలుగనీయదని తెలిపారు.

గాయత్రీదేవి అలంకరణలో సర్వమంగళా దేవి అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని విశ్వభారతి పాఠశాల సమీపంలో వెలసిన సర్వమంగళా దేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు సర్వమంగళా దేవి అమ్మవారిని అర్చకులు హరిస్వామి ఆధ్వర్యంలో గాయత్రీ దేవి అలంకరణ చేసి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఓబులేశ్వరమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, ధర్మకర్తలు గొర్ల మోహన్ రెడ్డి, భూదేవమ్మ, గంగాధర్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

సిద్దవటం : మాధవరం-1 గ్రామంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మంగళవారం గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

సుండుపల్లెలో..

సుండుపల్లె : మండల కేంద్రంలోని వైశ్యా బజార్‌లో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి గాయత్రీదేవిగా పూజలు అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నందలూరులో పార్వతీదేవి అలంకారం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం పార్వతీదేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహశ్రేష్టి, సెక్రటరీ గెలివి నాగ సురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహప్రసాద్, మంచికంటి నారాయణ, యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భపాలం సునీల్‌కుమార్, గెలివి లోకేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

వీరబల్లి : మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ వద్ద ఉన్న దుర్గమ్మ గుడిలో మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, సోదరుడు గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిదేవి అలంకరణలో గంగాభవానీ అమ్మవారు

సిద్ధవటం : సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో బంగారుపేట గ్రామ శివారులో వెలసిన శ్రీ గంగాభవానీ అమ్మవారు మంగళవారం రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయ, కర్పూరాలను సమర్పించి పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

భవానీదేవి అలంకారంలో అమ్మవారు

చిన్నమండెం : మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో మంగళవారం అమ్మవారు శ్రీ భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కన్యకా పరమేశ్వరీ..కరుణించమ్మా..!

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ భద్రకాళీ అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో, అలాగే శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారు అన్నపూర్ణేశ్వరీ దేవి అమ్మవారి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని పార్వతీ దేవి రూపంలో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.

రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరి

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో మంగళవారం అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రపుష్పం, దశ హారతులు, మంగళహారతి నిర్వహించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

భవానీ దేవి అలంకారంలో దర్గా మాతాజీ

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం నీలకంఠ్రావుపేట పంచాయతీలోని శ్రీ దర్బార్ సాయినగరలో వెలసిన సమర్థ సద్గురు దర్గా మాతాజీ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు శ్రీ భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

బిల్వవృక్ష నివాసిని అలంకారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

చిట్వేలి : మండలంలో శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం చిట్వేలి శ్రీ కన్యకాపరమేశ్వరీ (అమ్మవారిశాల) ఆలయం, పాత చిట్వేలిలో వెలసిఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్రుడి ఆలయం, కేఎస్ అగ్రహారం శ్రీ రంగయ్య స్వామి ఆశ్రమం తదితర ఆలయాలలో అమ్మవారు బిల్వ వృక్ష నివాసినీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వందలాదిగా అమ్మవారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

రాజంపేట టౌన్ : శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. మంగళవారం వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి బిల్వవృక్ష నివాసినిదేవి అలంకారంలో, మారెమ్మ మధుర మీనాక్షిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బిల్వవృక్ష నివాసినిదేవి అలంకారంలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరిదేవిని ఆర్యవైశ్యులు అమ్మవారిశాలలోని గర్భగుడిచుట్టూ ఊరేగించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని తరించారు.

మేదాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

పుల్లంపేట : దసరా ఉత్సవాలలో భాగంగా మండల పరిధిలోని అనంతంపల్లి వద్ద వెలసి ఉన్న శ్రీ మేడాలమ్మ తల్లి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

జగన్మోహినీ అలంకారంలో అమ్మవారు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరులోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మంగళవారం అమ్మవారు జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూడవరోజు అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకారం చేయనున్నారు.

క్లుప్తంగా

వైద్య కళాశాలలను పరిరక్షించాలి

సుండుపల్లె : ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వాసుపత్రులు ప్రైవేట్‌పరం (పీపీపీ) కాకుండా ప్రజలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు, అఖిల పక్ష కమిటీగా ఏర్పడి పరిరక్షించాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. సీఎం చంద్రబాబు రాయలసీమ ద్రోహపు చర్యలను నిలువరించేందుకు రాష్ట్రంలోని ప్రజాస్వామిక వాదులంతా గళం విప్పాలన్నారు.

ఏయూలో ఐడియాస్ సెలక్షన్ ప్రోగ్రాం



ఎంపికైన విద్యార్థులతో వీసీ, ప్రిన్సిపాల్

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీలో స్మార్ట్ ఇండియా హాకథాన్-2025 ఐడియాస్ సెలక్షన్ ప్రోగ్రాం మంగళవారంతో ముగిసింది. వంద వినూత్న ఐడియాలు విద్యార్థులు ప్రదర్శించారు. వాటిలో అత్యుత్తమైన ఆలోచనలను ఎంపిక చేసి, జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హాకథాన్‌కు సమర్పించారు. ఏయూ వీసీ డాక్టర్ సాయిబాబారెడ్డి పర్యవేక్షణలో ఈ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నామాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ, సమన్వయకర్త, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ హరికృష్ణ, డీన్స్, హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నందలూరు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నందలూరు గ్రామ పంచాయతీలోని అరుంధతివాడలో క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భవిత యువత మీదనే ఆధారపడి ఉందన్నారు. యువత సామాజిక సేవలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, స్థానికులు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై అవగాహన అవసరం



ప్యూరిఫైడ్ మోటార్లను పరిశీలిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : విద్యార్థులు వృత్తి విద్యపై అవగాహనతో పాటు నైపుణ్యం పెంచుకోవాలని వృత్తి విద్య శిక్షకులు బి. సుధాకర్ సూచించారు. మంగళవారం రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు వృత్తి విద్య పరిశ్రమల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని ఖాద్రీ ఏజెన్సీస్ (ప్యూరిఫైడ్ ఆర్ఓ సేల్స్ అండ్ సర్వీస్ సెంటర్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు వృత్తి విద్యలో నైపుణ్యం పెంచుకుంటే జీవనోపాధి కూడా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ బి. సుమతి, వృత్తి విద్య సమన్వయకర్తలు ఆర్, కమలాకర్, సి. యోగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న రెవెన్యూ సిబ్బంది క్రికెట్ మ్యాచ్

రాయచోటి టౌన్ : రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు రాయచోటి ఆర్‌డీఓ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌ను అన్నమయ్య జిల్లా జట్టు, తిరుపతి జట్టు ఈ నెల 28వ తేదీ ఆదివారం వైఎస్ఆర్ జిల్లా వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియంలో తలపడతాయని అన్నమయ్య జిల్లా క్రికెట్ టీం కెప్టెన్ నరసింహకుమార్ (రాయచోటి తహసీల్దార్) తెలిపారు. ఈ మ్యాచ్ కడపలోని వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం

నందలూరు : మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం 20వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోషల్ ఆడిట్ సిబ్బంది ఉపాధి తదితర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీఓ మురళి మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీలకు సంబంధించిన అన్ని రికార్డు వివరాలను చర్చించి తీసుకుంటామన్నారు. ఈ గ్రామసభకు సర్పంచ్, సెక్రటరీలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

---

300 యూనిట్లు దాటితే వాహనమిత్రకు కత్తెర!

- తేల్చి చెప్పిన సచివాలయ సిబ్బంది
- లబోదిబో మంటున్న ఎలక్ట్రికల్ ఆటో డ్రైవర్లు



రాజంపేట సబ్‌కలెక్టరేట్‌కు వచ్చిన ఎలక్ట్రికల్ ఆటో డ్రైవర్లు

రాజంపేట : వాహన మిత్రకు రాష్ట్ర ప్రభుత్వం మరో మెలిక పెట్టింది. 300 యూనిట్ల కరెంటు బిల్లు దాటితే వాహనమిత్రకు అనర్హులుగా పరిగణిస్తున్నారు. ఇప్పుడు రోడ్డుపైకి అనేక ఎలక్ట్రికల్ ఆటోలు వస్తున్నాయి. డీజల్, పెట్రోలు ధరల భారం మోయలేక చాలామంది బ్యాటరీ ఆటోలను తీసుకొని, జీవనోపాధి చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. కరెంటు చార్జింగ్‌తో బ్యాటరీ ఆటోలు నడుస్తాయి. అలాంటప్పుడు 300 యూనిట్లు దాటితే కరెంటు బిల్లు వస్తుంది. ఇప్పుడు ఈ నిబంధనను ప్రభుత్వం తీసుకురావడంపై బ్యాటరీ ఆటో డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు ఉచితబస్సు ప్రయాణంతో బాడుగలు లేక ఆదాయం కోల్పోయామని ఎలక్ట్రికల్ ఆటో డ్రైవర్లు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు.

సబ్ కలెక్టరేట్‌కు తరలివచ్చిన బ్యాటరీ ఆటోడ్రైవర్లు

మంగళవారం సబ్‌కలెక్టరేట్‌కు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవర్లు, తమ ఆటోలతో సహా తరలివచ్చారు. పరిపాలనాధికారి శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు శంకరయ్య, అక్బర్, బాస్కర్, శ్రీనివాసులులు విలేకర్లతో మాట్లాడుతూ వాహన మిత్ర పథకం ద్వారా రూ.15వేల ఆర్థిక సాయం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నామన్నారు. సచివాలయం సిబ్బంది కరెంటు బిల్లు 300 యూనిట్ల కంటే ఎక్కువ వస్తుందని వాహనమిత్ర పథకం వర్తించిందని తేల్చిచెపుతున్నారన్నారు. ఎలక్ట్రికల్ ప్యాసింజర్ ఆటోలకు కరెంటు బిల్లుతో సంబంధం లేకుండా వాహనమిత్ర పథకం ద్వారా రూ.15వేలు మంజూరు చేయాలని విన్నవించుకుంటున్నామన్నారు.

ఆర్‌యూబీ గేటు.. ప్రయాణంలో లేటు!



ఆర్‌యూబీలోకి వెళ్లకుండా గేటును ఏర్పాటు చేసిన రైల్వే అధికారులు



రైల్వేగేటు పడటంతో నిలిచిపోయిన వాహనదారులు

నందలూరు : నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు ఆర్‌యూబీలోని నీటిని తరలించలేమని చెతులేత్తయడంతో రైల్వే అధికారులు ఆర్‌యూబీలోకి వెళ్లకుండా గేటును ఏర్పాటు చేశారు. బహుదా నది నుంచి కన్యక చెరువుకు వెళ్లే కాలువకు నీళ్లు వదలడంతో ఆర్‌యూబీ నీటితో నిండిపోయింది. దీంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. నాగిరెడ్డిపల్లి నుంచి బస్టాండు వైపు రావాలంటే రైల్వేగేటు దాటుకుని రావాలి. రద్దీగా ఉండే నందలూరు రైల్వే కేంద్రంలో ఎక్కువగా రైళ్ల రాకపోకలు కొనసాగుతూ ఉంటాయి. దీంతో గేటు ఎక్కువ సమయం మూసివేస్తున్నారు. దీనివల్ల ప్రయాణికులు గేటు వద్ద ఎక్కువ సేపు వేచి ఉండాల్సి వస్తోంది. కాలువకు నీరు వచ్చిన ప్రతిసారి ఆర్‌యూబీలోకి నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. భక్తులు ఆలయానికి వెళ్లేందుకు కూడా పలు రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పని గంటల పెంపు చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో కార్మికుల పని గంటలు పెంచుతూ చేసిన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న లేబర్‌కోడ్ విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం యథాతథంగా అమలు చేస్తూ దారుణంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.54 కోట్లతో మాచుపల్లి బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు



మాచుపల్లి పెన్నానది వద్ద మాట్లాడుతున్న ఆర్ అండ్ బీ ఏఈ రామాంజనేయులు

సిద్ధవటం : మాచుపల్లి- ఖాదర్ బంగ్లా రహదారిలో పెన్నానదిపై నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.54 కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆర్ అండ్ బీ ఏఈ రామాంజనేయులు తెలిపారు. సిద్ధవటం మండలంలోని మాచుపల్లి పెన్నానది వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సెప్టెంబర్ 1న రాజంపేట పర్యటన సందర్భంగా బ్రిడ్జి నిర్మాణం విషయాన్ని మాచుపల్లి గ్రామస్తులు చంద్రబాబు దృష్టికి తీసుకురావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిశీలించామన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.54 కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి



జ్ఞాపికను అందజేస్తున్న ప్రొఫెసర్ మురళీధర్‌రావు

రాజంపేట టౌన్ : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవాలని ప్రొఫెసర్ డి.మురళీధర్ రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఏబీవీపీ జిల్లాస్థాయి శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏబీవీపీ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందని, ఇది ఎప్పటికి ఇలాగే కొనసాగుతూ విద్యార్థి సంఘాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యార్థి సంఘాలు విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తూనే తమ చదువును నిర్లక్ష్యం చేయకుండా ఉన్నత విద్యావంతులై ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. తొలుత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం, డాక్టర్ టి.పెంచలయ్య జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ఏబీవీపీ నాయకులు నాగిరెడ్డి, పవన్‌కుమార్, సాయిహితేష్, అభిలాష్, ఆంజనేయులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాయచోటి టౌన్ : నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐవైఎఫ్ (అఖిల భాతర యువజన సమాఖ్య) అన్నమయ్య జిల్లా అధ్యక్షులు దార్ల రాజశేఖర్, కార్యదర్శి జక్కల వెంకటేష్‌లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. నిరుద్యోగులకు జీవన భృతి రూ.3 వేలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న ఎస్టీ, ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. వాలంటీర్ వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలని, అలాగే వారికి ఉద్యోగ భద్రత కల్పించి అర్హత ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గత ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఫార్మకో విజిలెన్స్ విజేతలకు బహుమతులు పంపిణీ



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : ఫార్మకో విజిలెన్స్ విజేతలకు మంగళవారం ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఫార్మసీ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు రాణించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఏయూ వైస్ చాన్సలర్ డాక్టర్ సాయిబాబారెడ్డి మాట్లాడుతూ ఔషధ రంగంలో రాణించాలంటే కష్టంగా కాకుండా ఇష్టపడి ఫార్మసీ విద్యను పూర్తి చేయాలన్నారు. అన్నమాచార్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ వివిధ పోటీలలో చక్కటి ప్రదర్శన, నైపుణ్యతను చాటిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాలకు చెందిన డాక్టర్ గిరి, శ్రావణకుమారి, మణి దీప్, వినీల, హాసిని తదితరులు పాల్గొన్నారు. కాగా విజేతలుగా నిలిచిన వారిలో వర్షిని, వంశీకృష్ణ, విశ్వతేజ, కె.శిల్ప, అప్సనా, ప్రవీణ్‌రాయ్, సాయిసుకీర్తనరెడ్డి, పవన్‌కుమార్, శివసోనియా, భాను, లిఖిత, లక్ష్మీ, సుస్రత్, షహింతరాజ్, కళ్యాణి, జమున తదితరులున్నారు.